# జీవితరంగం

## – స్వరాజ్య పద్మజ కుందుర్తి



వందేళ్ళ క్రిందట.. ఇద్దరు అమ్మాయిలు, పదేళ్లకే వితంతువులయ్యారు, అమ్మానాన్నలు లేరు, నమ్మినవారు ఆస్తి అంతా దోచేశారు, జీవితాంతం ఎలా గడపాలి? జీవితపోరాటాన్ని కొనసాగిస్తూనే గాంధీగారి పిలుపునందుకుని స్వాతంత్ర్యోద్యమంలోకి దూకారు, ఎక్కడో బహిరంగసభలో తలిదండ్రులనుంచి తప్పిపోయి ఏడుస్తున్న పసిపాపను అక్కున చేర్చిపెంచుకున్నారు, ఒకవైపు తమదైన జీవనపోరాటం, మరోవైపు దేశంకోసం పోరాటం.. వీళ్ళు చరిత్రపుటల్లో కనిపించకపోవచ్చు, పెద్దల ఉపన్యాసాల్లో వినిపించకపోవచ్చు.. కానీవాళ్ళు ప్రదర్శించిన ఆ పోరాటపటిమ గురించి తెలుసుకుంటుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది, నిలువెత్తు స్ఫూర్తిశిఖరాలు కళ్ళముందు కదులుతాయి. వాళ్ళపేర్లు- కనుపర్తి హనుమాయమ్మ,కొండా సత్యవతమ్మలు. అలనాటి వాస్తవ సంఘటనలను వారి మనవరాలు స్వరాజ్య పద్మజకుందుర్తిగారు నెలనెలా కథన రూపంలో మనకందిస్తున్నారు.



కనుపర్తి హనుమాయమ్మగారు



కొండా సత్యవతమ్మగారు

## వెలుగు నిండిన రోజులు

"**అలాగే** మాకు తెలియకుండానే కాలం గడిచిపోయింది. బయట జరిగే విషయాలు ఏవీ మాకు తెలియనిచ్చేవారు కాదు కానీ నెమ్మదిగా ఎవరో ఒకరికి కొన్నివార్తలలు తెలుస్తుండేవి. శాసనోల్లంఘనం బాగా పెద్దయెత్తున జరుగుతోందనీ ఇంకా ఎక్కువమంది జైళ్ళపాలు అవుతున్నారనీ తెలిసింది. సత్యాగ్రహం లో భాగం గా మొదట విదేశీ వస్తు బహిష్కరణనీ, రెండో విడతగా ఈ శాశనోల్లంఘననీ ప్రవేశపెట్టారు గాంధీజీ. "

"గాంధీ గారు శాసనోల్లంఘనం లో భాగంగా మొదటగా  ఉప్పుమీద వేసిన అధిక పన్నును తొలగించాలని సత్యాగ్రహం చేసినప్పుడు చీరాలలో  అందరం ఉప్పుని అపురూపం గా పొట్లాలు కట్టి అమ్మాం. ఆ తరువాత ఆ ఉద్యమాన్ని ఇంకా ఉధృతం చేసి సభలూ సమావేశాలూ నిర్వహించాం".

"అసలు శాసనోల్లంఖన అంటే ఏమిటి అమ్మమ్మా?" అడిగాను నేను. "శాసనోల్లంఘన అంటే బ్రిటీష్ వారు పరిపాలన చేస్తున్నారు కదా అప్పుడు వారు అమలుపరిచే చట్టాలూ, శాసనాలు ఏవీ మనం పాటించకుండా ఎదురు తిరగటం అన్నమాట. అంటే బ్రిటీష్ వారిని పరిపాలకులు గా గుర్తించక పోవడం అన్నమాట అన్ని ఉద్యమాలకంటే ఈ ఉద్యమం చాలా ఉధృతంగా కొనసాగింది. ప్రజలుకూడా బ్రిటీషువారితో ఇకతాడో పేడో తేల్చుకోవాలన్న పట్టుదలకు వచ్చారు."

"అందువల్ల మాలాంటి వారు కూడా చేతనయినంతవరకూ ప్రజలను చైతన్యవంతులను చెయాలన్న ఉద్దేశ్యం తో ఇంటింటికీ తిరిగి ఈ సత్యాగ్రహ ఉద్యమం గురించి ప్రసారం చెయ్యటం. సభలూ సమావేశాలూ నిర్వహించటం చేసి ఇలా జైళ్ళకు వెళడానికి కూడా సిద్ధపడ్డాం కదా! అలాగే దేశవ్యాప్తంగా అనేక వేలమంది జైళ్ళలో ఉండిపోయారు. ప్రజలు చట్టాలను ఎదిరించటం మొదలు పెట్టాక బ్రిటీషువారికి పరిపాలన కొంచెం కష్టం అయ్యిందనే చెప్పాలి."

"అప్పుడు లార్డ్ ఇర్విన్ అనే గవర్నరు ఒకాయన గాంధీగారితో మాట్లాడి ఒక ఒప్పందం చేసుకున్నాడు. గాంధీగారు కూడా కొన్ని షరతులతో  ఆఒప్పందానికి సమ్మతించాడు. అందులో భాగంగా పరిపాలనలో భారతీయులు కూడా భాగస్వాములు కావాలని, ఇప్పటివరకూ జైళ్ళలో ఉన్నవారిని వదిలిపెట్టాలని, లండన్ లోని బ్రిటీష్ పాలకులతో మాట్లాడటానికి అనుమతించాలనీ ఇలాంటి మరికొన్ని షరతులతో ఈ ఒప్పందం జరిగింది. అందులో భాగంగా మమ్మల్నందరినీ జైలునుంచి విడుదల చేశారు.గాంధిజీని బ్రిటన్ లో రౌండ్ టేబుల్ సమావేశానికి ఆహ్వానించారు."

"కుల, మత, జాతి బేధాలు లేకుండా అప్పటిదాకా భారతీయులు గా అక్కడే కలుసున్న అందరం విడిపోవటం బాధగానే అనిపించింది. విచిత్ర పరిస్థితులలో అందరం కలిసి జీవించాము కదా ...అందరి మధ్యా విడలేని స్నేహబంధం ఏర్పడింది. అందరం ఒకరి అడ్రసులు ఒకరు తీసుకొని విడిపోయాం. తరువాత చాలాకాలంపాటు మా మధ్య లేఖలు నడిచాయి. ఏప్పుడో వీలున్నప్పుడు ఒకరికొకరం కలిసేవాళ్ళం. "

"అవును అమ్మమ్మా గుర్తొచ్చింది. ఒక బామ్మగారు రెండేళ్ళ క్రితం వచ్చారు కదా ! తను మధురలో కృష్ణ సేవలో ఉంటాను అని చెప్పారు. ఆవిడ జైల్లో నీస్నేహితురాలినని చెప్పారు. ఒక వారం పాటు మనింట్లో ఉన్నారు కూడానూ" అన్నాను.

"అవును తను అన్నపూర్ణ ! ఆస్తిని అంతా స్వాతంత్రోద్యమం లో ఖర్చుపెట్టి, తరువాత మధురా బృందావనం చేరి ఆ భగవంతుని సేవలో తరించి కాలం చేసింది." అమ్మమ్మ ఆ స్నేహితురాలిని తలుచుకొంది.

"జైలు నుంచి విడుదలయ్యి గుంటూరుకి వచ్చేసాను. నేనుజైల్లో ఉన్నప్పుడు అక్కయ్య వార్ధాశ్రమానికి వెళ్ళి అక్కడ కొంత కాలం శిక్షణ తీసుకుంది. గుంటూరు వచ్చేసరికి నాకు ఒక ఆశ్చర్యం ఎదురయింది. సాంబశివరావు దంపతులకు అప్పటివరకూ సంతానం లేదు. వారికి వివాహమయ్యి చాలాకాలం అయింది. సత్యభామ అక్కయ్య కూడా సంతానం కోసం అనేక నోములూ వ్రతాలూ చేస్తుండేది. ఇంక సంతానం కలగదని భావించి ఆ దంపతులు మద్రాసులో ఒక పేద బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన ఒక ఆడపిల్లను పుట్టిన నెలలోపే తెచ్చుకుని పెంచుకుంటున్నారు. "

"ఇంట్లోకి పసిపిల్ల రావడం తో కావలసినంత సందడి వచ్చింది. మా అందరి చేతుల్లో ఆ ఆడపిల్ల చాలా అపురూపం గా పెరుగుతున్నది. మాకైతే ఆ పిల్ల ముద్దుమురిపాలతోటే కాలం గడిచిపోతోంది. మళ్ళీ మా ఊరికి వెళ్ళాలని కూడా అనిపించలేదు. అలాగే  కొంత కాలం గడిచింది. గుంటూరులో ఉంటూనే చుట్టుప్రక్కల తెనాలి లోనూ విజయవాడలోనూ జరిగే సభలకు వెళ్ళి వస్తున్నాం. ఆ పాపాయికి సాంబశివరావు గారి తల్లిపేరు రంగమ్మ ఆవిడపేరే పెట్టారు. "

"ఓహ్ రంగడు ఆమ్మా ! " అన్నాను నేను ఆశ్చర్యంగా.

"అవును రంగడామ్మే ! ఆవిడను చిన్నప్పుడు తెచ్చుకుని పెంచుకున్నారు. అలా నాలుగేళ్ళు ఎలా గడిచిపోయాయో కూడా తెలియలేదు. పొలం గురించిన చింత తప్ప ఇంకేమీలేదు. మధ్య మధ్యలో మా ఊరు వెళ్ళి కవుళ్ళు  వసూలు చేసుకుంటున్నాం. కానీ మాకు తెలియకుండా మా వెనకాల మా వూళ్ళో చాలా విషయాలు జరిగాయి. మేము సాగు చేసుకోలేక వదిలేసిన దాదాపు నలభై ఎకరాల బీడుభూమి మా తమ్ముడు  ఊళ్ళో రైతులకు కొంత సొమ్ముతీసుకుని అమ్మేశాడు. భూమి తనదేననీ వారసత్వం గా వచ్చిందనీ పత్రాలు సృష్టించాడు."

"ఆ విషయం గా గుంటూరు మళ్ళీవచ్చి కోర్టులో కేసువేశాము. ఆ కేసును మొదట్లో రాధా కృష్ణమూర్తి అనే లాయరు గారికి ఇచ్చాము కానీ తరువాత కేసు మద్రాసు కోర్టుకు మారటం తో ప్రకాశం అన్నయ్యే చూశాడు."

"ఆ కేసు గెలిచారా అమ్మమ్మ?" అన్నాను.

"గెలిచాము. కానీ చాలా కాలం పట్టింది. ఈ లోగా కొనుక్కున్న వాళ్ళు కొంత సాగులోకి తెచ్చారు. వాళ్ళు వచ్చి పొలం మీద చాలా ఖర్చుపెట్టామనీ కొంత డబ్బు ఇప్పించమనీ కోరటంతో మేము కూడా అంతపొలం సాగుచెయ్యలేమని ఆలోచించి మేము సాగులోకి తెచ్చుకున్న పాతిక ఎకరాలు మాత్రం ఉంచుకుని మిగిలిన కోర్టు కేసుగెలిచిన  ఆ నలభై

యెకరాలూ కేసులు ఓడిపోయిన ఆ రైతులకే కొంత డబ్బు తీసుకుని అమ్మేశాము. వాళ్ళు కూడా ఆనందం గా డబ్బు ఇచ్చి మా దగ్గర కొనుక్కున్నారు.”

“ఇంత మంచివారు మీరు ఆ కరణం గారి తప్పుడు మాటలు విని మిమ్మల్ని ఇబ్బంది పెట్టాం మన్నించండమ్మా” అన్నారు. మా తమ్ముడికి తల కొట్టేసినట్లు అయింది. దానితో ఇంకా మామీద కసి పెంచుకున్నాడు. మేము ఆడబ్బుతెచ్చి గుంటూరులో ఉంటూ స్వాతంత్ర ఉద్యమం లో ఖర్చుపెట్టుకుంటూ ఆనందం గా ఉన్నాము. ఇలా జరుగిపోతున్న మా జీవితం అనుకోని మలుపు తిరిగే రోజు ఒకటి వస్తుందని కలలో కూడా అనుకోలేదు. అలాంటి సంఘటన ఒకటి జరిగింది అంది అమ్మమ్మ. “

కాలేజీ వయసుకొచ్చిన దాన్ని కనుక నాకు అర్ధమయింది అప్పటికి ఆ విషయం నాకు తెలుసు. “అమ్మమ్మా ...అది అమ్మ మీకు దొరికిన రోజా” అన్నాను.

“అవునమ్మా అప్పుడే ...మీ అమ్మను మాకోసం భగవంతుడు పంపించాడు” అన్నది.

“అమ్మమ్మా అసలు అమ్మ ఎలా దొరికింది మీకు” అడిగాను.

“అప్పుడు గుంటూరులో ఇంకొక సభ జరిగింది. ఆ సభకు అన్ని ఊళ్ళనించి చాలా మంది పాల్గొన్నారు. తెనాలి నుంచి కొంతమంది బండ్లు కట్టించుకొని వచ్చారు. వారితో పాటుగా ఎలా వచ్చిందో మరి మీ అమ్మ ! తెల్లగా నాజూకుగా చక్కని పరికిణీ వేసుకుని కలవారి బిడ్డలాగా కనిపించింది. సభ జరిగేటప్పుడు అక్కడే గుంజను పట్టుకుని ఏడుస్తూ నిలబడి ఉంది. “ఎవరమ్మాయివమ్మా నువ్వు " అని అడిగాను జవాబు చెప్పలేదు. “ఆకలి వేస్తుంది” అన్నది.

“నాకైతే చాలా బాధ వేసింది పాపం ఎవరిబిడ్డో ఆకలి గొని ఉంది అనిపించింది. వెంటనే భోజనాల దగ్గరకు తీసుకుని వెళ్ళి కడుపు నిండా అన్నం పెట్టాను. ఎవరి అమ్మాయో అని మైకుల దగ్గర మూడేళ్ళ పాప తప్పిపోయిందని మాదగ్గరే ఉన్నదనీ చెప్పాము సభ అయిపోయినా కూడా ఎవ్వరూ రాలేదు. సాయంత్రం వరకూ అక్కడే ఉన్నాము. ఎవరో ఒకరు వచ్చి పాపను తీసుకెళతారు కదా అని ఎదురు చూశాము. సాయంత్రమైనా ఎవ్వరూ రాలేదు చీకటి పడుతున్నది అని ఇంటికి తెచ్చాము.”

“స్నానం చేయించి అన్నం పెట్టి పడుకోపెట్టాను. తన చిట్టి చేతులను నా మెడచుట్టూ వేసి పడుకుంది. ఎవరి బిడ్డో పాపం ఏనాటి ఋణమో అనుకున్నాను. మరో రెండురోజులు గడిచినాయి. పోలీసు రిపోర్టు ఇద్దామనుకున్నాము. ఇంతలో కోర్టు పనిమీద ప్రకాశం అన్నయ్య వచ్చారు. పిల్లని చూసి మురిసిపోతూ “నీ పేరేమిటమ్మా " అని అడిగారు. అమ్మ ముద్దుగా “రాధమ్మ " అని చెప్పింది. “మహా లక్ష్మిలా చక్కగా కళగా ఉంది లక్ష్మి అని పెట్టవలసింది” అన్నారు.

"వివరాలు తెలుసుకొని ఆరోజు ఏవూళ్ళనుండి జనం వచ్చారో ఆరా తీద్దాము. ఎందుకు మళ్ళీ పోలీసులతో గొడవ" అన్నాడు. "పైగా ఆపిల్ల బెంగతో ఏమీ లేదుకదా నీదగ్గర చనువుగానే ఉన్నది కదా " అన్నాడు. "అవును అన్నయ్యా నాపక్కనే పడుకుంటోంది నేను పెడితేనే తింటున్నది" అన్నాను. అన్నయ్య నవ్వుతూ "అయితే ఈ పిల్ల సాక్షాత్తూ ఆ చిన్ని కృష్ణుడే... ఆ దేవకిని వదిలి ఈ యశోద పెంపకం లో పెరగాలేమో" అన్నాడు.

"మీ అమ్మకూడా అలాగే ఆట పాటల్లో మునిగిపోయి అసలు తల్లిదండ్రులను అడగలేదు నన్ను అమ్మా అని పిలిచేది. రంగడు ఆమ్మ కూడా తన తోటే అమ్మను ఆడించుకునేది. ఇద్దరూ బొమ్మరింట్లో తోడుతోడుగా ఆడుకునేవారు." నాకు కూడా మామయ్యా వాళ్ళింట్లో బొమ్మరిల్లు గుర్తుకు వచ్చింది. చిన్న గుండ్రటి ఇల్లు వాకిట్లో ఒక పక్కగా కట్టి ఉండేది. అందులో చిన్న చిన్న పిల్లలు కూర్చోవటానికి చెక్క కుర్చీలు బుజ్జివి ఉండేవి. చుట్టూ అలమరల్లో భలే భలే బొమ్మలు ఉండేవి. రెండు అందమైన చెక్కబొమ్మలు, దేవుళ్ళ బొమ్మలు, మేనాలు, పెళ్ళి ఊరేగింపు, బొజ్జ బ్రాహ్మడు ఇలా చాలా బొమ్మలు ఉండేవి. అమ్మమ్మ భోజనాలకు పిలిచేదాకా బొమ్మరింట్లో ఆడేవాళ్ళం.

ఆ బొమ్మరింట్లోనే మా అమ్మ, ఆమ్మా ఆడుకునే వాళ్ళట! "అలా నెలరోజులు గడిచాయి మీ అమ్మ నన్ను అమ్మా అనేది ఆ పిలుపుకు ఎంతలా అలవాటు పడిపోయానంటే ...మీ అమ్మ అసలు తల్లిదండ్రులు కనిపిస్తే వెళ్ళిపోతుందేమో అన్న బెంగ ఎక్కువైపోయింది నాకు. అప్పుడు. ఇంకొక నెల గడిచాక తెనాలి లో ఎవరింట్లో ఒక చిన్న పాప తప్పిపోయిందని వెతుకుతున్నారన్న సమాచారం దొరికింది. నేను భయపడ్డాను. అసలు వాళ్ళ పాప కాకపోయినా అమ్మను తీసేసుకుంటారేమో అని. అమ్మ దూరమవుతుందేమో నన్న బెంగతో ఏడుస్తూ కూచున్నాను. పెద్దమ్మమ్మ నన్ను దిగులు పడకు అసలు విషయం కనుక్కొని వస్తానని తెనాలి బయలు దేరి వెళ్ళింది. "

"కానీ అక్కడ కనపడకుండా పోయింది ఒక ఆసాముల బిడ్డ. ఆపిల్లకు అయిదారేళ్ళుంటాయి. అమ్మచాలా చిన్నపిల్ల. అయినా అప్పటికీ తెనాలిలోనే వాళ్ళ పాప దొరికేసింది. వాళ్ళే రెండు వీధుల అవతల ఒక బ్రాహ్మల పాప తప్పిపోయిందనీ, ఇంకా దొరకలేదనీ చెప్పారట. పెద్దమ్మమ్మ వాళ్ళ ఇల్లు వెతుక్కొని వెళ్ళింది. ఇంటినిండా అయిదారుగురు సంతానం తో వాళ్ళ ఇల్లు నిండుగా ఉన్నదట. పనివాళ్ళు ఆ పిల్లల ఆలన పాలనా చూస్తున్నారట. ఆయింటి ఇల్లాలు ఏదో అనారోగ్యం తో మంచం పట్టిందట. ఇంటి పేరు 'శంకర ' వారనీ, అతడు కొంత కాలం చల్లపల్లి రాజా వారి దగ్గర దివాన్ జీ గా చేశాడని తరువాత చల్లపల్లి రాజావారు ఉయ్యూరు జమీందారుకి తన కుమార్తెతో వివాహం చేసి, అక్కడి ఆస్థి లెక్కల్లో తేడాలు వస్తున్నాయని ఈయనను ఉయ్యూరు రాజావారిదగ్గర కొంతకాలం ఉండమని పంపించినట్లు తెలిసింది."

"ఆయన ఆ గొడవల్లో పడి గత ఆరు నెలలుగా ఇంటికి రావడం లెదని తెలిసింది. తల్లి అనారోగ్యం! పిల్లలకు సరైన ఆలనా పాలనా లేక ఇల్లు అస్తవ్యస్తం గా ఉంది. ఆ పరిస్తితులు చూసి అక్కయ్య "అయ్యో బిడ్డ కనపడకుండా

పోయినా పట్టించుకునే వారు లేరు కదా" అని బాధపడింది. పిల్లపేరు రాధమ్మ అని తెలుసుకొని తమదగ్గరే ఉన్నదని కంగారు పడొద్దనీ చెప్పివచ్చింది.

మూడోనాడు ఇద్దరం పిల్లని తీసుకొని తెనాలి ప్రయాణమయ్యాం. నాకైతే ఏడుపు ఆగలేదు. ఈ రెండునెలల్లో మీ అమ్మ ఎంతగా చేరిక అయిందంటే .. ఆ బిడ్డ నా బిడ్డే అనీ దేవుడు వేరే తల్లి కడుపున పుట్టించాడనీ అనిపించేది. "

"అమ్మ అక్కడకు తీసుకు వెళ్ళినా పెద్ద సంతోషం గా లేదు. నన్ను కావిలించుకుని ఏడ్చింది. బలవంతం గా వాళ్ళమ్మ దగ్గరకు పంపినా వెళ్ళలేదు. మా బిడ్డ కాదుగనుక వదిలేసి వచ్చాము. వచ్చాక ఎంతగా ఏడ్చానో ..అన్నం కూడా సయించేది కాదు. అక్కయ్య మాత్రం బాగా అరిచింది నన్ను. మన బిడ్డ కాదు పరాయి బిడ్డ అని తెలిసీ ఇంత అనుబంధం ఎందుకు పెంచుకున్నావనని.

దేవుడు నా మొర ఆలకించినట్లుగా పదిరోజుల తరువాత తెనాలి నుండి ఉత్తరం వచ్చింది. మేము వదిలేసి వచ్చాక రాధమ్మకు బాగాజ్వరం వచ్చిందనీ అమ్మా ! అమ్మా అంటూ నన్నే కలవరిస్తోందనీ , వీలయితే వెంటనే వచ్చిపొమ్మనీ రాసారు. "

"అయ్యో నాలాగే రాధమ్మ కూడా బాధ పడుతున్నదని అక్కయ్య తను ఒక్కతే వెళ్ళొస్తానని అన్నా వినకుండా నేనూ బయలు దేరి వెళ్ళాను. తెనాలి వాళ్ళ ఇంటికి వెళ్ళగానే మీ అమ్మ రాధ ఆనందం అంతాఇంతా కాదు ఇద్దరం కాసేపు కావలించుకుని ఏడ్చాం. రాధ మాతో వచ్చేస్తానని ఏడుపు. ఆవిడని ఎలాగో వప్పించి మాకు ఎవరూ లేరనీ రాధను పెంచుకుంటామనీ అడిగాం. ఆయన రావాలని చెప్పిందావిడ వాళ్ళ ఇంట్లోనే వారం రోజులు ఉండి ఆయన వచ్చాక విషయం చెప్పి రాధమ్మను తెచ్చేసుకున్నాం. "

"ఇంక రాధమ్మ మాబిడ్డే అనుకున్నాక మా ఆనందం చెప్పనలవి కాదు. గుడిలో స్వామికి అభిషేకం చేయించి బంధు మిత్రులకు భోజనాలు పెట్టి మా పిల్ల అనిపించుకోని లక్ష్మీ రాధమ్మ అని పేరు పెట్టుకున్నాం. ఏ బంధమూ లేని మాకు భగవంతుడు రాధ రూపం లో ఒక గొప్ప అనుబంధాన్ని ప్రసాదించాడని మురిసిపోయాం. రోజుకో కళతో పూర్ణ చంద్రుడిలా మెరిసిపోతూ మాదగ్గరే పెరుగుతోంది రాధమ్మ. మళ్ళా కవుళ్ళ సమయం రావటంతో చిట్టి రాధమ్మని తీసుకుని మావూరు బయలు దేరి వెళ్ళాము. అక్కడ రాధమ్మని చూసి అందరూ మురిసిపోతే మా దత్తు అన్నగారు మాత్రం పగతో రగిలి పోయాడు. "

*(కొనసాగింపు వచ్చే సంచికలో..!)*

Post your comments